

# గడ్డిపూవు

**మాన్యం అచ్యుతలక్ష్మి కుమారి**

సూర్యుడు పశ్చిమాద్రిని చేరుకుంటు న్నాడు. ఆకాశం నిర్మలంగా, తెల్లగా పాలసముద్రంలా ఉంది. పచ్చని వాతావరణంతో, అడవి కోయలల మధుర గానంతో, పిల్లతెమ్మరలతో ప్రకృతి శోభాయమానంగా ఉంది. అది కొండల మధ్య ప్రపంచానికి దూరంగా, ఆధునికత అంటని పల్లె. ఎటు చూచినా పచ్చని కొండలు, గుబురుగా ఎదిగిన చెట్లు, బండరాళ్ళ మధ్య వయ్యారంగా ప్రవహించే సెలయేళ్ళు అతి మనోజ్ఞంగా ఉంటుందా ప్రదేశం. అక్కడ స్థిర నివాసం ఏర్పరుచుకున్నవాళ్ళకి అక్కడ అందం గోచరించకపోయినా, అక్కడికి క్రొత్తగా వచ్చే ఎవరికైనా ఆ ప్రదేశం కన్నులపండుగ కలిగించక మానదు.

రంగురంగుల ముతకబట్టల్లో నెత్తి మీద నల్లని కుండలు పెట్టుకుని ఏదేదో మాట్లాడుకుంటూ నవ్వుకుంటూ ఎత్తు నుండి పల్లానికి దిగుతున్నారు పదిహేను పదహారేళ్ళ మధ్య ఆడపిల్లలు. వాళ్ళ కట్టూబొట్టూ అతి మోటుగా ఉంది.

వాళ్ళ భాషకూడా చాలా యాసగా ఉంది. వాళ్ళ సరసాలు కూడా చాలా మొరటుగా ఉన్నాయి. అయినా ఎక్కడ చూచినా పచ్చదనమే ఆవరించి ఉన్న ఆ వాతా వరణంలో వాళ్ళు అడవి పువ్వుల్లా ఉన్నారు.

వెలుగును పూర్తిగా కప్పేస్తున్న గుబురు పొదల మధ్యనుంచి మెలికలు తిరుగుతూ బండరాళ్ళపైనుండి గెంతుతూ పెద్దరాళ్ళను ఒరుసుకుంటూ వయ్యారంగా ప్రవహిస్తూంది నాగావళి నది. ఆడపిల్ల లందరూ ఒడ్డున కుండలూ చుట్టగుడ్డలూ పెట్టి ఒడ్డున ఉన్న బండలమీద కొందరూ, మోకాలివరకు మాత్రమే నీరున్న నీటిమధ్య ఉన్న బండలమీద కొందరూ కూర్చుని ముచ్చట్లాడుకుంటు న్నారు.

"గంగ కూడా మనువాడేత్తందర్రా! మన జట్టులో ఒకళ్ళు తక్కువయి పోతర్నూ!" అందో అమ్మాయి గంగను చేత్తో పొడుస్తూ.

"తొందరపడవాక నీకూ అయితదిలే." ఇంకో పిల్ల అంది.

"అందరికీ అయితది ఈ ఏడాది. ఓళకెనక, ఓళకి ముందర అంతే. అందరం జట్టూడిపోవలసినవాళ్ళవేగా." అంది మరో అమ్మాయి.

"ఏపే గంగా మనువాడేసి ఎల్లిపోనాక మమ్మల్ని ఏదస్తుంచుకుంటావా?"

"పోయే! సిగ్గులేని గుంటా" గంగ సిగ్గుపడింది. అందరూ ఆ ప్రదేశం ప్రతిధ్వనించేలా నవ్వేరు.

వాళ్ళందరి మాటల్లో కలవనిదీ, ఆ నవ్వులో శ్రుతి కలపనిదీ అందరిలోకీ కాస్త ప్రత్యేకంగా, పొడవుగా చువ్వలా ఉండే నీలి ఒక్కర్తే. ఆమె బండరాయి మీద కూర్చుని కాళ్ళు నీళ్ళలో తపతప కొడుతూ ఎక్కడో ఆలోచిస్తూ పర ధ్యానంగా ఉంది.

"ఏటే నీలీ! ఈ ఆ అనవు. అంద రికీ మనువులు కుదిరిపోయినట్టే. మరి నీకు మీ తాత ఓరినీ చూణ్ణేదా?" నీలిని కుదిపింది ఒక పిల్ల.

ఉలిక్కిపడిన నీలి అయోమయంగా చూచింది.

"నేదునేయే, దీన్ని దీని తాత చంద మావ కిత్తాడంట. మామూలు మనువు కియ్యండంట." వేళాకోళమాడింది ఇంకో పిల్ల.

"ఈ మూగదయ్యాన్ని వోడు కట్టు కుని సుకపడుతాడులే...."

నీలి వాళ్ళవంక ఉక్రోషంగా చూచింది. "నా నసలు మనువే అణ్ణు. మనువు మనువని తెగ మురిసిపోతర్నూ. మనువానాణ్ణక ఏటుంది సుకం. కట్టు కున్నోడు తాగిరాడం డబ్బులు గుంజు కోడం తన్నడం, అయినాక ఏడుపు కూడు. అంతే గందా! ఈ మాత్తరం దానికి అంత ఇదయిపోవాలేటర్రా!

అందికే నాకు మనువంటే భయ్యం." అంది నీలి.

"ఎట్టెట్టా!" అందరూ ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవిచేశారు.

"రండెహె! పొద్దుగుంకిపోతంది. గూళ్ళకి పోదాం." లేచింది నీలి తన కుండ తీసుకుని. ఆమెతోపాటు మిగిలిన వాళ్ళు లేచేరు. కుండ తీసుకుంటున్న గంగ యధాలాపంగా కాళ్ళదగ్గిర ఉన్న గడ్డిపువ్వుల్ని గుప్పెటతో పట్టుకుని పీక బోయింది. నీలి చేయి కంగారుగా, హఠాత్తుగా వచ్చి ఆమె చెయ్యి పట్టుకుంది.

"ఒగ్గెయ్యే గంగా! అటినట్టా పీకేత్తే నీ కేటొత్తాదే! పా ప ం అయ్యిరాడా అన్నిటినాగే ఎంత చక్కగా పూసినయ్యో చూడు." అంది నీలి.

"ఓయబ్బో! తల్లో ఎట్టుకునే పువ్వు ల్లానే ఇసిత్రం సెబ్తావ్ నువ్వు. ఇయెందుకు పనికొత్తయి?"

"తల్లో ఎట్టుకుంటే వొద్దన్నయేంటే? దేవుడు అన్నిటినీ ఒకనాగే పుట్టించిండు. అన్నిటినాగే అయ్యి పూత్తన్నయి. ఇట్టా పీకి నలిపెయ్యడం పాపం గదే." జాలిగా అంటూ గంగచేతినుండి ఆ పువ్వుల్ని విడదీసింది నీలి.

"కోమిల్లో పంతులోరు సెప్పిన ఏదాంతం సెపుతావ్ నువ్వు. పదపద. పొద్దుగూకి పోతంది." మరో అమ్మాయి హెచ్చరించడంతో అందరూ కుండలు ముంచి నెత్తిన చుట్టగుడ్డలు సవరించుకుని కుదురుగా కుండలు పెట్టుకున్నారు. వరుసగా ఒకరి తరువాత ఒకరుగా ఎత్తు ప్రదేశానికి ఎక్కసాగేరు.

## 2

తడకె తీసిన శబ్దానికి ఇటు తిరిగేడు తాత మంచంలో పడుకునే. "నీలీ!వొచ్చి నావేటే." ఆయాసం మరో మాట అననీ లేదు అతనిని.


"వొచ్చినా తాతా! పొద్దుగుంకిపోనాది. ఆ గుంట్ల కేపొద్దూ మనువూసులు తప్పితే మరోటి రావు. ఊసులాడుకుంటా అడనే ఉండిపోనారీయాళదాకా! ఉండు దీపం ముట్టిత్తా!" తనలో తను చెప్పు కుంటున్నట్టు చెప్పుకుంటూ దీపం వెలిగించింది నీలి. ఆ తరువాత పొయ్యి వెలిగించి జావకి ఏసరు పడేసింది.

భారంగా నిట్టూర్చేడు తాత. అతని మనసు నిండా చీకట్లు ముసురుకుంటు న్నాయి. చెప్పలేని వ్యధ గుండెను కృంగదీస్తూంది. నీలి వయసు పిల్లలంద రికీ పెళ్ళిళ్ళయిపోతున్నాయి. ఊళ్ళో చాలామంది అప్పుడే తనను అడుగు తున్నారు 'కుర్రదానికి మనువు సెయ్యవా పెద్దోడా?' అంటూ. తను వాళ్ళ కేమీ సమాధానం చెప్పలేకపోతున్నాడు. తన కున్న ఆరు మేకలు ఈ గుడిశె ఇచ్చేస్తే నీలి పెళ్ళయిపోతుంది. కానీ తనకున్న సమస్య అది కాదు. దాని పెళ్ళయి పోయిన తరువాత అది సుకంగా, ఇప్పటి

లాగానే నవ్వుతూ బ్రతకగలదా? లేదా? అన్నది అతని గుండెను పీడిస్తూంది. నీలి సంగతి తనకు బాగా తెల్సు. తమ జాతిలో పుట్టవలసినది కాదు. దాని మనసు అతి మెత్తన. అతిగా మాట్లాడదు. కానీ దాని మనసు ఎల్ల వేళలా ఆలోచిస్తూనే ఉంటుంది. తనెప్పుడైనా కాస్త గట్టిగా కసురుకున్నా కొంచెం కఠినంగా మాట్లాడినా చాలు ఆ రోజంతా అది ఏదో పోగొట్టుకున్నదానిలా, ఎంతో వ్యధ చెందుతున్నదానిలా మూగగా గడుపుతుంది. అలాటప్పుడు దాని తల్లి తన కూతురు మల్లి గుర్తుకొస్తుంది అతనికి. ముమ్మూర్తులా మల్లి నోట్లోనుంచి ఊడిపడ్డట్టే పుట్టింది నీలి. దాని బుద్ధులు, దాని మాటలు, దాని ఆలోచనలు అన్నీ అవే నీలిలోనూ రూపుదాల్చేయి. అతను మల్లినెంతో గారాబంగా పెంచేడు. దాన్ని అసలు కష్టపడనిచ్చేవాడు కాదు. కాస్త గట్టిగా ఎప్పుడూ మందలించి ఎరుగడు. ఆడుతూ పాడుతూ అడవిమల్లెలా పెరిగింది మల్లి. అంతే దానికీ పెళ్ళీడు వచ్చింది. పెళ్ళిచెయ్యక తప్పలేదు అతనికి. తను పెంచడమైతే అందరికీ అతీతంగా పెంచేడు. కానీ దాని జీవితం మటుకు తమ జాతివాళ్ళందరికీ అతీతంగా మలచలేకపోయేడు. ఫలితం కష్టం ఎరక్కుండా పెరిగిన మల్లి అత్తింట్లో గొడ్డుచాకిరీ చెయ్యలేకపోయేది. పొలం పనులు చేతకావు. ఒంటి మీద చిన్న దెబ్బకూడా పడ్డం ఎరుగని మల్లి భర్త చేత దెబ్బలు తినలేకపోయేది. ఎప్పుడూ తిట్లుతిని ఎరుగని ఆమె మనసు తాగివచ్చి తిట్టే భర్త మాటలు, తిట్లు సహించలేకపోయేది. ఆ మోటు సరసాలు అసహ్యించుకోకుండా ఉండలేకపోయేది. భర్త పశుచర్యలని ఆమోదించలేకపోయేది. అత్త ఆడబిడ్డల అరళ్ళు ఓర్చుకోలేకపోయేది. గర్భవతైన మల్లి అత్తింట్లో కష్టాలు భరిస్తూ చిక్కి సగమై కట్టెపుల్లలా మారి తండ్రి ఇల్లుచేరింది. ఆడపిల్లని కని తన బిడ్డకి పెళ్ళిచెయ్యొద్దు అని కన్నీళ్ళతో తండ్రిని కోరింది. ఆ రాత్రే అది కన్నుమూసింది.

అతను తన ఒక్కగా నొక్క కూతురు మల్లిని మనుమరాలు నీలిలోనే చూసుకుంటూ బ్రతకసాగేడు. వద్దనుకుంటూనే నీలిని కూడా తనకు తెలియకుండానే మల్లికంటే అపురూపంగా పెంచేడు. అప్పుడప్పుడూ తన కూతురి సంగతులు నీలితో చెప్పుకుంటూ కన్నీళ్లు పెట్టుకుని ఊరటపొందేవాడు. తన తల్లి గురించి తెలుసుకున్న నీలికి తమ జాతి మగవాళ్ళంటే, మనువులంటే కంపరమెత్తిపోయేది. భయంతో వెన్ను జలదరించి పోయేది.

ఆడపిల్లకి పెళ్ళిచెయ్యకూడదు అనుకున్నంత తేలికకాదు చెయ్యకుండా ఉండడం. చిన్నపిల్లగా ఉన్నప్పుడు ఎలా నిర్ణయించుకున్నా ఎన్ని అనుకున్నా




పెళ్ళీడు వచ్చేసరికి అవన్నీ గాల్లో కలిసిపోతాయి. చుట్టూ ఉన్నలోకం ఆ పిల్లనీ, ఆ పిల్లని కన్నవాళ్ళనీ బ్రతకనియ్యదు. ఈ సత్యం తెలిసిన అతను ఎటూ నిర్ణయించుకోలేక సతమతమయిపోతున్నాడు. తను రోగంలో ఉన్నాడు. ఎప్పుడూ హరీమంటాడో తనకే తెలియదు. తను పోతే నీలి ఏమవుతుంది? దాన్ని ఈ జనం బ్రతకనిస్తారా? ఒక అయ్యచేతిలో పెడితే వాడు ఎలాంటివాడవుతాడు? అతడిని నిరంతరం వేధించే ఆలోచనలివే.

వండినదేదో తాత కింత తినిపించి తనూ తిన్నాననిపించింది నీలి. నులక మంచం గుడిశె కవతల వేసి తడికె దగ్గరకి లాగింది. మంచమ్మీద చింకిబొంత పరిచి మేను వాల్చింది.

"రొజ్జగాలేత్తంది. లోన తొంగో రాదంటే." కేకేసేడు తాత.

"ఒక చిటవుండి వొచ్చేత్తా తాతా! ఎన్నెల మా చక్కగుంది." పడుకునే సమాధానం చెప్పింది నీలి. తాత ఇంకేమీ అనలేదు.

వెల్లకిలా పడుకుని వెన్నెల హాయిని, ఆనందాన్ని అనుభవిస్తున్న నీలి నిండు చందమామకేసి తదేకంగా, పరవశంగా చూడసాగింది. నిండు చందమామని చూసేసరికి ఆమెకి చంద్రంబాబు గుర్తొస్తాడు. గుర్తుకు రావడానికి అసలు ఆమె అతడిని మర్చిపోయిం దెప్పుడు? ఎప్పుడూ అతను ఆమెలో మెదులుతూనే ఉంటాడు. అయితే ఇలా తీరిగ్గా వెన్నెల్లో ఆరుబయట పడుకుని చందమామ వంక చూస్తూ అతని రూపాన్ని తలుచుకోవడం, తమ పరిచయాన్ని, స్నేహాన్ని నెమరు వేసుకోవడం ఆమె కెంతో ఆహ్లాదంగా, ఆనందంగా ఉంటుంది.

'ఎంత మంచోడు చందరంబాబు!' అనుకున్న నీలి మనసు తమ పరిచయపు రోజులవైపు, ఆ మధుర స్వప్నంవైపు పరుగులు తీసింది.

## 3

ఆ రోజు నీలి మేకలను తోలుకుంటూ ఊరికి చాలా దూరంగా వచ్చేసింది, అక్కడనుండి చూస్తే ఊళ్ళో ఇళ్ళసలు కన్పించనే కన్పించవు. నాగావళి నది మెలికలు తిరుగుతూ ఆ ప్రదేశంలో ప్రవహించడంవల్ల ఆ కొండప్రాంతంలో అది ఏడుసార్లు గోచరిస్తుంది వచ్చే బాట సారులకి. దూరంగా మేకలు పచ్చిక మేస్తున్నాయి. నీలి పనసచెట్టు నానుకుని అలవోకగా నిలబడి పరిసరాల్ని గమ నిస్తూంది. హఠాత్తుగా ఆమె దృష్టి ఒక దగ్గిర ఆగిపోయింది. జనసంచారం లేని ఆ ప్రదేశంలో ప్రవహిస్తున్న నీటిఒడ్డున నిలబడిన అతను ఎత్తుగా వున్న స్టాండుపై తెల్లని కాగితంమీద ఏకదీక్షగా ఏదో చేస్తున్నాడు. అదేమిటో అర్థంకాలేదు నీలికి. కుతూహలంగా చూస్తూ నిశ్శబ్దంగా అతని దగ్గిరకి వెళ్ళింది.

అతను ఏకాగ్రతగా, దీక్షగా డ్రాయింగ్ పేపరుమీద ప్రకృతి సౌందర్యాన్నంతా పొందుపరుస్తున్నాడు. ఎంతో సహజత్వం ఉట్టిపడుతున్న ఆ సౌందర్యాన్ని చూస్తూ అచ్చెరువు చెందింది నీలి.

"ఓరు బాబూ నువ్వు? మా కొండలు గుట్టలు చెట్లు పుట్టలు అన్నీ ఆ కాగితంలో మూటగట్టేసి అట్టుకుపోతారా ఏటి బాబూ?" అంది, నీలి కళ్ళు వెడల్పు చేసుకుని చూస్తూ. ఉలిక్కిపడి ఇటు తిరిగేడు అతను. ఎదురుగా ముదుర ఆకు పచ్చ ముతక లంగా, దానిమీద తెల్లని ముతక వాయిల్ పైటగుడ్డ తిప్పి దోపి, బిగించివేసిన జడలో బంతిపూలదండ, కళ్ళకి దట్టంగా కాటుక, నుదుటన పెద్ద ఎఱ్ఱని బొట్టు, కాళ్ళకి గజ్జెలు, చేతుల నిండా ఎఱ్ఱని మట్టిగాజులతో చామన ఛాయగా, అందం అమాయకత్వం పోటీ పడుతున్న విశాల నయనాలతో, సన్నగా తీగలా ఉన్న నీలిని చూడగానే అతని కళ్ళు తళుక్కున మెరిశాయి.

"ఏటట్టా తినేసేలా చూత్తన్నావ్? నన్నుగూడా ఆ కాయితంలో రాసేత్తావా ఏటి? అసలు నిన్నియ్యన్నీ ఎవరు రాయ మన్నారు?" బుకాయింపుగా అడిగింది నీలి. అతను చిరునవ్వు నవ్వేడు. ఆ నవ్వు చూచేసరికి నీలి గుండెందుకో ఝల్లుమంది.

"దీనిని చిత్రకళ అంటారు. ఇవన్నీ నేను చిత్రించినంతలో వీటి అందం తరిగిపోదులే. నీ బొమ్మ వేసినా నీ అందం తరిగిపోదు. వెయ్యమంటావా?" చిలిపిగా అడిగేడు.

"ఎట్టెట్టా! నా బొమ్మే!" గుండెలమీద చెయ్యి వేసుకుని ఉత్సాహంగా, ఆసక్తిగా అంది నీలి.

"ఔను. నీ బొమ్మ వేస్తే చాలా అందంగా వస్తుంది. నే నసలు బొమ్మలు వేసుకోవడానికే ఇక్కడికి వచ్చేను. ఎన్నెన్నో బొమ్మలు వెయ్యాలనుకున్నాను. కానీ ఈ క్షణంలో నిన్ను చూసిన తరువాత నీ బొమ్మ తప్ప ఇంకేమీ వెయ్యకూడదనిపిస్తూంది." ఉత్సాహంగా అన్నాడు అతను. అతనిలో ఉన్న చిత్రకారుడు తమ పరిచయం అతి స్వల్పం అన్న సంగతి పూర్తిగా మర్చిపోయాడు.

నీలి ఆలోచనలో పడిపోయింది. తన బొమ్మ చూసుకోవాలని ఆశగా ఉంది. కానీ ఈ సంగతి తెలిస్తే తాత ఏమంటాడోనని భయంగానూ ఉంది. అసలితను మంచివాడో కాదో.

"నీ పేరేమిటి? ఒంటరిగా ఇక్కడికెందుకు వచ్చేవు!" అన్నాడతను.

"నీ పేరేమిటి? నువ్వెందు కీడకొచ్చినావు!" పెంకిగా అంది నీలి.

"గడుసుదానివే!" నవ్వేడతను. "నా పేరు చంద్రం. నేను బొమ్మలు వేసుకోవడానికే వచ్చేనని ఇందాక చెప్పేను."

"అట్టాగా! అయితే ఇనుకో నా పేరు నీలి. అదిగో అడ ఆ మేకలు మేత్తన్నాయి సూడూ! ఆటితో వొచ్చినా! నే పోతా పొద్దుగుంకిపోతంది. తాత తిడతాడు" చెంగున పరిగెట్టింది నీలి.

"నీలీ! ఆగాగు. మరి బొమ్మ...."

"రేపు మళ్ళొత్తా!" వరుగాపకుండానే చెప్పింది నీలి. వెళ్తున్న ఆమెవంక చూస్తూ నవ్వుకున్నాడు చంద్రం.

ఆ మరునాడు ఎంత వద్దనుకున్నా కాళ్ళు చంద్రం ఉన్న దిక్కుకే లాగసాగేయి. తన బొమ్మ అతనిచేత గీయించుకోవడమా వొద్దా అన్న సంఘర్షణ మనసునంతా నిండిపోయి ఆరాటపెడుతూంది. అతనిపట్ల తనకు తెలియకుండానే ఏర్పడిన ఆకర్షణో, తన బొమ్మని చూసుకోవాలన్న ఆరాటమో మొత్తానికి ఆమె మనసు బొమ్మ గీయించుకోవడంవైపే మొగ్గుచూపింది. అతడి నవ్వు తలుచుకుంటుంటే ఆమె కేదో మైమరపు కలుగుతూంది. ఒళ్ళు గాల్లో తేలిపోతున్నట్టుగా ఉంది.

ఆమె రాదని నిర్ణయించుకున్న చంద్రం హఠాత్తుగా ఆమెని చూచేసరికి సంభ్రమాశ్చర్యాలతో ఉక్కిరిబిక్కిరయ్యేడు.

"వెరీ గుడ్! వచ్చేవన్నమాట." అన్నాడు ఉత్సాహంగా.

"వొచ్చినా! బొమ్మ గీత్తవా!" కళ్ళు వాల్చుకుంటూ అంది నీలి.

"ఓ అంతకంటేనా! నిన్నటినుండి ఒక్క బొమ్మ గియ్యలేదు తెలుసా? నీ బొమ్మ గియ్యాలనే ప్రయత్నిస్తున్నాను. కుదరడంలేదు. నువ్వలా చెట్టుక్రింద కూర్చోవాలి." అంటూ ఆమెను చెట్టుక్రింద బండరాయిమీద తనకు కావలసిన భంగిమలో కూర్చోపెట్టేడు. తను తిరిగి

స్థాంతు దగ్గరకి వచ్చి అన్నీ సరిగ్గ అమర్చుకున్నాడు.

"కదలకూడదు మరి. నీ కెప్పుడు విసుగ్గా ఉంటుందో చెప్పు, ఆపేస్తాను." అన్నాడు.

"అట్టాగే!" కదలకుండా కూర్చుంది నీలి.


చంద్రం తన దృష్టి అంతా కేంద్రీక రించి, నీలిని పరిశీలిస్తూ ఏకాగ్రతగా ఆమె చిత్రం గియ్యసాగేడు. అతడి చేతిలోని కుంచె జీవం పోసుకున్నట్టు నిదానంగా కదలసాగింది.

క్షణం కదలకుండా కూర్చోవడం అలవాటులేని నీలి ఎక్కువసేపు కూర్చో లేకపోయింది. ఆమె అవస్థ గ్రహించిన చంద్రం ఆరోజుకి చాలించేడు. ఆమెతో మెల్లగా మాటల్లోకి దిగేడు. ఆమె గురించి అన్నీ తెలుసుకున్నాడు. స్నేహంగా, ఆత్మీయంగా మాట్లాడేడు. చనువు పెంచు కున్నాడు. నీలి నిష్కపటంగా అతడికి తన గురించి పూర్తిగా చెప్పుకుంది. నీలి ఆ తరువాతరోజు కూడా వెళ్ళింది. అలా వరుసగా నాలుగు రోజులు క్రమం తప్ప కుండా వెళ్ళింది. తన చిత్రం పూర్తి కాలేదు. కానీ ఆమె హృదయంలో అతని చిత్రం మాత్రం పూర్తిగా రూపుదిద్దు కుంది. ఈ నాలుగు రోజులుకీ వారి స్నేహలత మరింతగా బలం పుంజుకుని పెరగసాగింది. అతడి సమక్షంలో ఆమెకి ఏవో భాషకందని భావాలు ముప్పిరి గొంటూ తలెత్తి అతనికేసి సూటిగా చూడ లేనట్టు చూస్తున్నాయి.

ఇంటి కొచ్చి ఆరుబయట వెన్నెల్లో పడుకుని అతని గురించే ఆలోచించు కునేది. అతడి నవ్వుని, మాటలనే గుర్తు చేసుకుంటూ మురిసిపోయేది. అతడు చాలా మంచివాడు అన్న నిర్ణయానికి ఆమె మనస్సెప్పుడో వచ్చేసింది. తమ పల్లెలో ఉండే మగవాళ్ళకీ అతనికీ మధ్య ఉండే తేడాని ఎక్కువ తక్కువల్నీ అంచనా వెయ్యసాగిందామె మనసు.

తమ పల్లెలోని యువకుల మోటు సర సోక్తులు, వెకిలి నవ్వులు కంపరమెత్తిస్తే చంద్రం అందమైన మృదు సంభాషణ, ఆత్మీయత ఆమె మనసుకి హాయిగా పన్నీటి జల్లులా జోలపాడుతున్నాయి. అతని చిరునవ్వు తన శరీరాన్ని పులకింప జేస్తుంది. ఏవో లోకాలకి తీసుకుపో తూంది. ఇన్ని రోజులు ఏకాంతంలో అంత చనువుగా మాట్లాడుకున్నా ఏనాడూ హద్దుమీరలేదు అతను. కనీసం చెయ్యి కూడా తాకలేదు. అదే తమ జాతివాళ్ళ యితే కాస్త అవకాశం దొరికితే చాలు కబళించడానికి ప్రయత్నిస్తారు. కాస్త చనువుగా మాట్లాడితే చాలు వెకిలి సంభా షణలోకి లాగుతారు. నీలి మనసూ, శరీరం కూడా అతడిని ఏకగ్రీవంగా సమ్మతిస్తున్నాయి.

నీలి ఆలస్యంగా ఇంటికి వస్తూండడం కనిపెట్టిన ఆమె తాత ఆమెని నిలేశాడు.




ముందు తడబడినా ఆ తరువాత తాత నుండి ఏమీ దాయడం చేతగాని నీలి ఉన్నదున్నట్టు అతడితో చెప్పేసింది.

అతను మండిపడ్డాడు. "నువ్వాడిచేత బొమ్మ గీపించుకుంటావా? నీ కసలు సిగ్గూలజ్జా ఉన్నాయా? బస్తీవోళ్ళ మాయల్లో పడిపోతన్నావ్! ఆళ్ళెంత గుండెల్దీసిన బంట్లో నీకు తెలుసేడుసా? ఈపాలి కొంప కదులు సెబుతాను. ఈ ఊసు ఊళ్ళో తెలిత్తే నీ కసలు మను వవుతుదా? ఈ పాటికే ఎంత మంది సూసినారో ఏటో!" ఆవేదనతో తల బాదు కున్నాడతను.

ఆ తరువాత ఇల్లు కదలలేదు నీలి. ఆమె తాత ఆమెని ఎక్కడకీ వెళ్ళనివ్వ లేదు. అయితే ఆమె మనసు మాత్రం అతని గురించి ఆలోచించడం మానలేదు. పాపం సగంసగం పూర్తయిన బొమ్మతో అతడు తన కోసం ఎంతగా ఎదురు చూస్తున్నాడో. ప్రెసిడెంట్ కొడుక్కి స్నేహితుడు. అక్కడే ఉంటున్న అతను ప్రెసిడెంట్‌గారింట్లో అందరినీ తన గురించి ఎంత వెర్రెత్తిపోతున్నాడో. అతనోసారి చూస్తే బాగుండును. అతడి గురించే ఆలోచిస్తున్న ఆమె మనసు అసలు నిలవడంలేదు. అతని సాన్నిధ్యం కోసం తపించిపోతూంది.

ఎవరికో పాము కరిస్తే మంత్రం వెయ్యడానికి వెళ్ళేడు ఆమె తాత. అదే అదననుకుని గబగబా పరిగెట్టింది నీలి. ఆమెకోసమే చుట్టూ పరికిస్తూ దిగాలుగా బండమీద కూర్చుని ఉన్నారు చంద్రం.

నీలి వెనుకనుంచి వచ్చి అతడి కళ్ళు మూసింది. ఆ స్పర్శ ఎవరిదో, ఆ చనువు అక్కడ ఎవరికుందో గ్రహించిన చంద్రంలో జీవం వచ్చింది. ఆనందంతో

ఉక్కిరిబిక్కిరవుతూ అమె చేతుల్ని పట్టి గబుక్కున ముందుకు లాక్కున్నాడు. ఉద్వేగంతో అమె రెండు బుగ్గల్నీ గాఢంగా చుంబించేడు. నీలి తనువంతా ఒక్కసారిగా పులకించిపోయింది. హృదయం ఆనంద ఉద్వేగాలతో ఊగిపోసాగింది. మైకంతో మొద్దుబారిపోతున్న మెదడులో హఠాత్తుగా ఏదో స్ఫురించింది. తక్షణం అతని చేతుల నుండి విడివడి దూరంగా కూర్చుంది. అతడి వంక చూడలేనట్టు కళ్ళు దించుకుంటూ 'ఇట్టా అగుతుందనే తాత వొద్దన్నాడేవో! ఎర్రిదాన్ని నాకేటీ తెల్దు.' తనలో తను అనుకుంటున్నట్టు సన్నగా గొణుక్కుంది నీలి. అమె మాటలకి ఇంకా అమెవంకే పరవశంగా చూస్తున్న చంద్రం ఉలిక్కిపడ్డాడు.

"ఏమిటి నీలీ బాధపడ్తున్నావా?" అని అడిగేడు మూర్ఖంగా.

నీలి అంతలోనే సర్దుకుంటూ నవ్వేసింది. "ఏటో బాబూ! మా తాత సాదత్తం అంతా! నా బొమ్మ నువ్వుగీత్తే నాకు మనువు అవదంట.అందికే నన్నీడికి రానియ్యలేదు. అడిపిచ్చిగాని నా మనువు కావాలంటన్నానా ఏటి?"

అప్రతిభుడయ్యాడు చంద్రం. "ఏమిటీ? నువ్వసలు మనువే చేసుకోవా?"

"ఊహూ! మనువాడితే ఆ తాగుబోతు నాయాళ్ళనేగా కట్టుకోవాలి? అట్టాటి ఎదవలంటే నాకు మంట." ఏవగింపుగా అంది. నీలి.

చంద్రం దూరంగా చూస్తూ ఏదో ఆలోచిస్తూండిపోయేడు.

"ఏటి బాబూ! అట్టా ఒల్లకుండిపోనావు. బొమ్మ గియ్యవా ఏటి?"

చంద్రం కళ్ళు తిప్పి అమె వంక చూచేడు. "నీలీ! నాకు మనుష్యుల్ని చూచి మనసులు పసిగట్టడం తెలుసు. నీకు నేనంటే చాలా ఇష్టం కదూ?" అని అడిగేడు.

"ఇట్టంనేపోతే బొమ్మ గీపించుకుంటానేటి? మా తాత వొద్దన్నా లగెత్తుకొత్తానేటి?" చిత్రంగా కళ్ళు తిప్పుతూ చెప్పింది నీలి.

"అయితే నన్ను పెళ్ళిచేసుకుంటావా?"

హఠాత్తుగా వచ్చిన ఆ ప్రశ్నకి స్థాణువయిపోయింది నీలి. అది కలో నిజమో తెలియడం లేదు. ఆ ప్రశ్న అమె మనసులో అంతులేని ఆనందాన్నీ కలిగిస్తూంది. భయాన్నీ, సందేహాన్నీ కలిగిస్తూంది. ఆ మధ్య తమ ప్రాంతం చూడ్డానికి వచ్చిన పట్నవాసపు నాగరిక యువతులవాళ్ళ వేషభాషలు, వయ్యారాలు అన్నీ కళ్ళముందు ప్రత్యక్షం కాసాగేయి. చంద్రాన్ని జంటతో ఊహిస్తే అతని ప్రక్కన అమె దృష్టిలో ఆ నాగరీకపు యువతే గోచరిస్తూంది గానీ, తనలాంటిది ఎక్కడా తన దృష్టిపదంలో నిలవడంలేదు.

యువ

"మాట్లాడవేం నీలీ? నే నంటే నీ కిష్టమేగా!"

"పరాచికాలా ఏటి బాబూ? ఇష్ట మయితే మాత్తరం అశ కంతుండాల. నే నంత అశబోతు ననుకున్నారా బాబూ? మీకేటి చందమామ నాగున్నారు. లచ్చ నంగా సదూకున్న టవును పిల్లొత్తాది. నన్నేటి సేసుకుంటారు బాబూ!" బరువుగా పలికిన నీలి కంఠంలో నిర్వేదం తొంగిచూస్తుంది.

"నిజమే కానీ, నాకు మా టౌను పిల్లలకంటే నువ్వే బాగా నచ్చేవు నీలీ! వాళ్ళలో లేని నిష్కల్మషం, మంచి మనసు, అమాయకత్వం, ప్రాణం పెట్టే ఆత్మీయత నీలో చూస్తున్నాను. అందుకే నువ్వు కావాలనుకుంటున్నాను...."

నీలి మాట్లాడలేదు. అతనన్న మాటలు ఆమెకి సరిగ్గా అర్థంకాలేదు. తనను మెచ్చుకుంటున్నాడని మాత్రం తెలుసుకుంది. ఆమె దృష్టి ఏటిఒడ్డున ఊదా రంగులో గుబురుగా పెరిగిన గడ్డిపూల పై తదేకంగా నిలిచిపోయింది. వంగి వాటిని తెంపి చేతిలోకి తీసుకుంది.

"ఈటిని సూసినారా బాబూ? ఇయ్యి గడ్డిపూలు. ఇట్టాంటిదాన్ని నేను. ఈటికి అందం, వాసన ఏటీ ఉండవు. ఈటి నోరూ తల్లో ఎట్టుకోరు. ఓరన్నా ఎట్టుకుంటే ఆళ్ళని ఎర్రోళ్ళంటారు...."

"మా నాగరీకుల దృష్టిలో నేనూ అలాటివాడినే నీలీ! నాకు చదువుంది గానీ ఉద్యోగం లేదు. పైసా సంపాదన లేదు. ఆస్థి లేదు. ఇవేవీ లేనివాడు ఎందుకూ కొరగానివాడి క్రింద లెక్క. మా పట్నవాసపు అమ్మాయిలకి ఇవన్నీ లేనివాడిని గౌరవించడం, ప్రేమించడం చేతకాదు. హేళనచేయటం తప్ప మరోటి చెయ్యరు. వాళ్ళ దృష్టిలో పెళ్ళిచేసుకునే అర్హత లేనివాడిని నేను. ఇవన్నీ లేకపోయినా నన్ను నన్నుగా ప్రేమించగలగడం, ఆత్మీయంగా మాట్లాడగలగడం నీ ఒక్కదానికే చేతనవును నీలీ. నీ ఆత్మీయత, అనురాగం నా కెప్పుడూ కావాలి నీలీ! అందుకే నేను నువ్వు కావాలనుకుంటున్నాను. నిన్ను మా పట్నం తీసుకువెళ్ళి నాకు కావలసిన విధంగా తయారుచేసుకోగలను. నిష్కళంకం, నిర్మలం అయిన మన దాంపత్యం చాలా ఆనందంగా ఉంటుంది నీలీ!" ఆవేశంగా చెప్పేడు చంద్రం, ఆమె వంక ఆరాధనగా చూస్తూ.

అతని ఒక్కొక్క మాటా పూల బాణాల్లా ఆమె మనసుని తాకి మనస్సును ఊయల లూగిస్తున్నాయి. హృదయం ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతూంది. తననుండి అతనేం కావాలనుకుంటున్నాడో అతనినుండి అదే తనకు కావాలి. అతడు తనతో చల్లగా, అనునయంగా మాట్లాడితే చాలు. తనను ఆత్మీయంగా చూసుకుంటే చాలు. ప్రేమగా లాలిస్తే చాలు. తనను పదిలంగా గుండెల్లో దాచు

కుంటే చాలు. కానీ.... కానీ చదువు సంధ్యలు లేని అనాగరికంగా పెరిగిన తనను అతను భరించలేడేమో జీవి తాంతం. తనను విసుక్కుంటాడేమో! బరువుగా, పీడగా భావిస్తాడేమో! అలా జరిగితే తన గుండె పగిలిపోదూ? నీలి మనసు తనకు చేతనయిన విధంగా ఆలోచిస్తూంది. తన ఆలోచనలు చెప్పడం ఆమెకి చేతకాదు. కానీ ఆ భాష ఆమె కళ్ళకి చేతనవునేమో, ఆమె భావ సంఘర్షణంతా ఆమె కళ్ళలో ప్రతిబింబిస్తూంది. ఆనందం, ఉద్వేగం, భయం, సంకోచం ఏ నిర్ణయం తీసుకోలేని బేలతనం ఇలా ఎన్నో చదివేడు చంద్రం ఆమె కళ్ళలో. ఆమె చూపులింకా చేతిలోని గడ్డిపూల వంకే స్థిరంగా నిలిచిపోయేయి. చంద్రం సుతారంగా ఆమె చెయ్యి అందుకుని మృదువుగా పిడికిలి విప్పి గడ్డిపూలని తీసుకున్నాడు.

"నీలీ! ఈ గడ్డిపూలు చూడూ! ఎంత నిర్మలంగా, అమాయకంగా వున్నాయో! వీటికి వాసన లేకపోయినా సహజమైన అందం వీటికి ఉంది. వీటి సొగసు చూడగలగడం చాలామందికి చేతగాక పోవచ్చు. ఇవీ ఆ భగవంతుడు సృష్టించినవే. ఆయన సృష్టిలో అన్నీ సమానమే. ఈ ఎక్కువ తక్కువలు మనుషుల భావనలలోనే ఉన్నాయి. ఆయన దృష్టిలో ఏదీ నిరర్థకం, నిష్ప్రయోజనం కాదు ...."

నీలి అప్పటికీ ఏమీ మాట్లాడలేదు. ఆమె హృదయం ఏ నిర్ణయానికీ రాలేక ఊగిసలాడుతూంది.

"నీలీ! నేను నిన్ను పోషించలేనేమో, సుఖపెట్టలేనేమో అని జంకుతున్నావా?" హఠాత్తుగా అడిగేడు చంద్రం.

చివ్వున అతనివంక తల తిప్పి చూచింది నీలి. ఆమె కళ్ళలో బాధ రెపరెపలాడింది.

"నేదు బాబూ! కూడు నేక కడుపులు కాలినా పర్నేదు. నీ సల్లని పిలుపూ, సూపూ ఉంటే శాన." కంఠం జీర బోతుండగా అంది. ఆమె కళ్ళలో చివ్వున నీళ్ళు తిరిగేయి.

చంద్రం చిరునవ్వు నవ్వేడు. ఆమె దగ్గిరకి వచ్చి ఆమె తలని గుండెల కాన్చుకున్నాడు. "నాకు తెలుసు నీలీ! నీ నుండి సమాధానం రాబట్టాలని అలా అన్నానంతే." ఆమె తలమీద ప్రేమగా చుంబించేడు.

ఆ తరువాత అతడు ఆమె చిత్రం గియ్యడం పూర్తిచేశాడు. సంతృప్తి, ఆనందం, అనురాగం నిండుగా ప్రవహిస్తున్న నీలిరూపు ఆరోజు మరింత సుందరంగా ఉండి అతడి చిత్రం అద్భుతంగా తయారుకావడానికి సహకరించింది.

ఆ రోజుతో చిత్రం పూర్తిచేసుకున్న చంద్రం తను అన్ని ఏర్పాట్లు చేసుకుని మళ్ళీ వస్తానని, ఆమె తాతతో మాట్లాడి



పెళ్ళిచేసుకుని తీసుకు వెళతానని నీలితో చెప్పి అ రోజే ప్రయాణమయ్యాడు. అతడిపట్ల వీసమెత్తు కూడా అపనమ్మకం లేని నీలి కన్నీళ్ళతోనే సాగనంపింది.

ఇంటికొచ్చిన నీలి జరిగినదంతా తాతతో చెప్పింది. తాత మొదట కోపంతో మండిపడ్డాడు. తరువాత నిదానంగా ఆలోచించేడు. క్రమంగా అతనికి కూడా చంద్రంపట్ల నమ్మకం కుదిరింది. నీలిని వశపర్చుకునే అవకాశం ఉన్నా కూడా ఆమెని పవిత్రంగానే ఉంచి ఏ మాత్రం తొందరపడకుండా పెళ్ళిమాటల వరకే మాట్లాడిన అతని మాటల్లో గురి కుదిరింది. అటువంటి మంచివాడికి తన మనుమరాలిని ఇస్తే ఆమె తప్పకుండా సుఖపడుతుందనిపించింది. ఆమె పెళ్ళి విషయంలో తననుభవిస్తున్న వేదన ఉపశమించ సాగింది. అతని హృదయంలో గూడు కట్టుకున్న బరువు క్రమంగా దిగిపో సాగింది.

ఆ రోజు నుంచీ నీలితోపాటుగా అతను కూడా చంద్రం రాకకోసం క్షణమో యుగంలా కళ్ళు కాయలుకాచేలా ఎదురుచూస్తున్నాడు. చంద్రం వెళ్ళి అప్పుడే ఆరునెలలయింది. తాత నిరాశతో కృంగిపోతున్నాడు. అతని అనారోగ్యం పదింతలుగా పెరగసాగింది.

నీలి మాత్రం నిరాశని, అపనమ్మకాన్ని తన హృదయపు దరిదాపుల్లోకి కూడా రానియ్యడంలేదు. ఎనలేని ఆశతో, మేరుపర్వతంలాంటి అచంచల విశ్వాసంతో అతడికోసం చకోరిలా ఎదురు చూస్తూంది. అతడితో తన పరిచయం, తమ స్నేహం కేవలం కొన్ని రోజులుది. అయినా ప్రతిక్షణం ఆ ఆలోచనలతోనే గడిపే నీలికి తమ అనుబంధం కొన్ని యుగాలదిగా అన్పిస్తూంది.

4

పట్నం నుండి ప్రెసిడెంట్‌గారబ్బాయి వచ్చేడని తెల్సింది నీలికి. చంద్రం గురించి అడిగి తెల్సుకోవాలన్న ఉత్సుకతతో పరుగు పరుగున ప్రెసిడెంట్ గారింటికి బయలుదేరింది నీలి. ఎదురుగా వరండాలోనే పేపరు చదువుతూ కన్పించేడు ప్రెసిడెంట్ కొడుకు.

"బాబూ! బాబూ! ఎప్పుడొచ్చినావు బాబూ! చెందరంబాబేటన్నా సెప్పేడా?" ఎంతో ఆరాటంగా, ఉత్సుకతగా అడిగింది నీలి.

అతను పేపరు అడ్డుతీశాడు. నీలికేసి నిదానంగా చూశాడు. "నిజంగా నీలీ! చంద్రం వేసిన నీ బొమ్మ చూచేకగానీ నిజంగా నువ్వింత అందంగా ఉంటావని నే నెప్పుడూ అనుకోలేదు." నవ్వుతూ అన్నాడు.


"అబ్బ! ముందు చెందరం బాబు గురించి సెప్పుబాబూ! నా కేటన్నా సెప్ప మన్నాడా? ఎపుడొత్తానన్నాడు?"

"నీలీ! ఎందుకే అంత ఆరాటం? చంద్రం ఈ నెల్లో తప్పకుండా వస్తాడు. నిజంగా వాడికి నువ్వెంత అదృష్టం తెచ్చి పెట్టేవే. వాడేసిన నీ బొమ్మ అంతర్జాతీయ చిత్రకళా పోటీలో ప్రథమస్థానం పొందింది...."

నీలి కళ్ళు గుండ్రంగా తిప్పుతూ "అంటే ఏటి బాబూ! కూసింత అరదమయేలా సెప్పుమరి" అంది అయోమయంగా.

"అంటేనా!" ఒకసారి తల గోక్కున్నాడు అతను. "అంటే నీ చిత్రం వేసినందుకు వాడికి చాలా డబ్బు వచ్చింది. నీ బొమ్మని అందరూ గొప్పగా మెచ్చుకున్నారు. వాడికి గొప్ప పేరూ, డబ్బు కూడా వచ్చేయి వాడిప్పుడు చాలా గొప్ప వాడయ్యేడు నీలీ! ఇప్పు డర్థమయిందా? వాడు నీకు తన కృతజ్ఞతలు తెలపమన్నాడు. త్వరలో వచ్చి నిన్ను తప్పకుండా కలుసుకుంటాడు." చెప్పేడతను.

నీలి కళ్ళలోకి వెయ్యి పున్నమిల వెలుగు ఒక్కసారిగా వచ్చి చేరింది. ఆనందంలో ఉక్కిరిబిక్కిరయింది.




"శానబాబూ శాన దేవుడు నిన్ను సల్లంగ సూడాల." చప్పున వెనుదిరిగిన నీలి పిచ్చి ఆనందంతో పరుగుపరుగున తన గుడిశె వైపు పరిగెట్టింది. చంద్రం గొప్పవాడయ్యేడంటే, అదీ తన మూలం గానే అనుకుంటే ఆమె కెంతో గర్వంగా, పట్టలేనంత సంభ్రమంగా ఉంది. ప్రపంచాన్నంతటినీ జయించినంతటి సంతోషంగా ఉంది.

కుక్కిమంచంలో మూలుగుతూ పడుకున్న తాతని సుడిగాలిలా వచ్చి వాటేసుకుంది నీలి. తన వెర్రి ఆనందంతో అతడిని ఉక్కిరిబిక్కిరిచేస్తూ "తాతా! ఆ బాబు వత్తన్నాడు తాతా! శానా గొప్పోడయి నా కోసవే వత్తన్నాడు. నాకు కుతజ్ఞతో ఏటో సెప్పమన్నాడంట. అంటే ఏటి తాతా? పిచ్చి తాతవి. నీ కేటెరుక? అంటే.... అంటే నేనంటే శానా ఇష్టం అని సెప్పడం గాబోల్ను." పిచ్చిదానిలా తను అడిగిన వాటికి తనే సమాధానం చెప్పేసుకుంటూ ఆనందోద్వేగాలతో నిలువెల్లా పులకించిపోసాగింది నీలి.

ఆమె మాటలు మెల్లిగా అర్థమయిన తాత కళ్ళలో ఆనందబాష్పాలు నిండుకున్నాయి. మనుమరాలి తలను లాలనగా నిమురుతూ "ఎట్టిముండ. ఎట్టా బతుకుద్దో!" అనుకున్నాడు వాత్సల్యంగా. అతని కనుల నుండి సంతృప్తి నిండిన రెండు అశ్రుకణాలు ఆమె శిరస్సుపై టప్పున పడ్డాయి.

ఆ రోజంతా ఆమె ఊరంతా తెగ తిరుగుతూ తన నేస్తురాళ్ళందరితోనూ తనకూ మనువుతుందంటూ, తను చాలా గొప్పవాణ్ణి కట్టుకుంటున్నానంటూ ఉత్సాహంగా, అధిగమించిన ఆనందంతో చెప్పుకుంది.

పదిరోజుల తరువాత ఒకరోజు ప్రెసిడెంట్‌గారిభార్యాయి కబురు పెడితే వెళ్ళింది నీలి. వరండా మెట్లవరకూ వచ్చిన నీలి కాళ్ళు టక్కున ఆగిపో యాయి. ఎదురుగా గదిలోనుండి కర్టెన్ తొలగించుకుంటూ వస్తున్నాడు చంద్రం. అతని రూపు, వేషం పూర్తిగా మారి పోయింది. దొరబాబులా ఉన్నాడు. నీలి కళ్ళు అపూర్వమైన కాంతితో తళతళ లాడేయి. ఆమె హృదయం ఉద్వేగంతో ఊగిపోసాగింది. ఏదో మాట్లాడ్డానికి నోరు తెరిచిన ఆమె మాటలు నోటిలోనే ఆగి పోయాయి.

లోపలనుండి సర్వాంగసుందరంగా, అతి నాజూకుగా ఉన్న ఒకమ్మాయి హుందాగా నడుచుకుంటూ వచ్చి చంద్రం ప్రక్కన నిలబడింది. చంద్రం ఆమె వంక చూస్తూ "చూడు రేఖా! ఈమే నీలి. చిత్రంలో ఉన్న నీలిని నిజంగా చూడా లన్నావుగా. అందుకే నిన్నిక్కడికి తీసు కొచ్చేను." అన్నాడు. నీలిని చూస్తూ "రా నీలీ! అక్కడే ఆగిపోయేవేం.ఈమె నా భార్య రేఖ. కాదు నా అదృష్టదేవత. ఈ మధ్యే నన్ను కోరి పెళ్ళిచేసుకున్న జడ్జీగారి ఏకైక పుత్రిక." అంటూ చెప్పేడు.

నీలి విద్యుద్ఘాతం తిన్నదానిలా నిలిచిపోయింది. ఆమె తలలో హోరు ప్రారంభమయింది. ఆమెకి భూమీ ఆకాశం అంతా గిర్రున తిరుగుతున్నట్టుగా ఉంది. కనుల కేమీ కన్పించటం లేదు.

"రేఖా! అలా ఉండిపోయావేమిటి? నీలిని సత్కరిస్తానన్నావుగా!" గుర్తు చేశాడు చంద్రం. రేఖ లోపలికి వెళ్ళింది. క్షణంలో తిరిగి బయటకి వచ్చింది. ఆమె చేతిలో ఒక పెద్ద పళ్ళెం. దానిలో ఖరీదయిన చీర, పళ్ళు, ఒకవైపు నోట్ల దొంతర.

ఆమె వయ్యారంగా ఒక్కొక్క అడుగే వేసుకుంటూ వరండా మెట్లు దిగింది. క్రింద ఉన్న పచ్చిక మీద నుండి మెల్లగా నడుస్తూ వస్తూంది. నీలి ఉన్నచోటనే శిలలా నిలిచిపోయింది. ఆమె ఊపిరి పీల్చడం, రెప్పవేయడం కూడా మర్చిపోయింది.

ఆమెకి ప్రపంచమేమీ కన్పించడం లేదు. కన్పిస్తున్నది ఒకటే దృశ్యం. నాజూకుగా నడిచి వస్తున్న రేఖ సిగలో ఒక ప్రక్కగా గర్వంగా తలెత్తుకుని నవ్వుతున్న ఎర్రగులాబీ, ఆమె పాదాల క్రింద నిర్దయగా నలుగుతున్న గడ్డిపూలు. అవి నీలివంక దీనంగా, హృదయ విదారకంగా చూస్తున్నాయి.